# పశ్చిమబెంగాల్ | మూతవేసిన టీ తోటల కార్మికుల దుస్థితి

**డార్జిలింగ్** టీగా పిలవబడుతున్న తేయాకు రకం, ప్రసిద్ధిగాంచినదిగానే గాక, మన దేశానికి గర్వకారణంగా భావిస్తారు. ఇటీవల ప్రధాని మోడీ, తన ఇంగ్లాండ్ పర్యటన సందర్భంగా విక్టోరియా మహారాణికి 'డార్జిలింగ్ టీ'నే బహుమతిగా అందజేశాడు.

రుచి, నాణ్యతల కారణంగా ప్రసిద్ధిగాంచి 'డార్జిలింగ్ టీ' దేశానికే గర్వకారణంగా భావించబడు తున్నప్పటికీ, ఆ డార్జిలింగ్ తేయాకు తోటలలో తమ రక్తాన్ని, స్వేదాన్ని చిందిస్తూ శ్రమించే కార్మికుల జీవితాలు మాత్రం దుర్భరంగా వున్నాయి. బ్రిటిష్ వలస పాలకుల కాలం నాటినుండి, ఈనాటివరకు ఈ టీ తోటలపై ఆధిపత్యం కలిగివున్న బ్రిటిష్ కంపెనీలు లేదా బ్రిటిష్ కంపెనీలతో ఒప్పందం చేసుకున్న భారతదేశ కంపెనీలు భారీస్థాయి లాభాలార్జిస్తుండగా, విదేశీ కంపెనీలు సంపదలను సమకూర్చుకుని లాభాలను తమ మాతృ దేశాలకు పెద్దఎత్తున తరలిస్తున్నాయి తప్ప, కార్మికుల జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వున్నాయి.

2002 నుండి, టీ తోటల రంగంలోకి దేశ ఆర్థికాభివృద్ధి పేరుతో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆహ్వానిస్తూ ప్రభుత్వం ఆమోదం తెల్పింది. టీ తోటలకార్మికుల జీవితాలలో, వారి పనిపరిస్థితులలో ఈ విధానాలు కూడా ఏమాత్రం సంతోషాన్ని నింపలేక పోయాయి. అయితే, టీ తోటల యజమానులకు మాత్రం లాభాల పంటను పండించాయి.

ఉత్తరబెంగాల్‌లోని అనేక టీ తోటలలో ప్రస్తుతం తీవ్రమైన దుర్భర పరిస్థితులు నెలకొని వున్నాయి. ఉత్తరబెంగాల్ టీ తోటలలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులు ఆకలి బాధలతో అల్లాడుతున్నారు. పలుచోట్ల 'ఆకలిచావులు' సంభవిస్తున్నాయి. 2015 సెప్టెంబరు 15 నుండి 31 లోపు, దాదాపు 45 రోజుల కాలవ్యవధిలో 13 ఆకలి చావుల వార్తలు వెలుగుజూశాయి. ప్రఖ్యాత డంకన్ టీ కంపెనీ యాజమాన్యంలో వున్న మూతవేసిన టీ కంపెనీలో ఈ మరణాలు సంభవించాయి.

మమతా బెనర్జీ నాయకత్వంలోని పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్మికుల మరణాలను 'ఆకలి చావులుగా' పేర్కొనటానికి నిరాకరిస్తూ, ఇవన్నీ అనారోగ్య మరణాలు లేదా సహజ మరణాలుగా పేర్కొంటోంది. అయితే, ఈ ఆకలిచావులను నిరసిస్తూ ప్రజలలో పెల్లుబికిన నిరసనల తర్వాత, టీ తోటలు మూసివేసిన కారణంగా కార్మికులు వత్తిడినెదుర్కొంటు న్నారని ప్రభుత్వ యంత్రాంగం అంగీకరించక తప్పలేదు.

అయితే తీవ్ర వత్తిడినెదుర్కొంటున్న, ఆకలి చావులకు గురవుతున్న ఈ టీ తోటల కార్మికులను రక్షించేందుకు తక్షణ చర్యలనేమీ తీసుకోకుండా, టీ తోటల యజమానులు టీ తోటలను సక్రమంగా నిర్వహించకుంటే ప్రభుత్వం వీటిని స్వాధీనపరచు కుంటుందంటూ ముఖ్యమంత్రి ప్రకటనచేసి సరిపెట్టారు. ప్రజల కళ్ళనీళ్ళు తుడిచేందుకు ఆకలి చావులుగా పేర్కొంటున్న వాటిపై సిఐడి విచారణకు ఆదేశించారు. బాధల అంచులలోకి చేరిన టీ తోటల కార్మికుల జీవితాలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలేవీ కనీసపాటి ఉపశమనం కల్పించేవి కాదనేది స్పష్టమే.

ఉత్తరబెంగాల్‌లోని దట్టమైన, విశాల అటవీ ప్రాంతాలను నిర్మూలించి డంకన్ టీ కంపెనీ 1857 నుండి భారతదేశంలో టీ తోటల సాగును ప్రారంభించింది. ఛోటా నాగపూర్, సంతాల్ పరగణాలలోని ఆదివాసీ ప్రజానీకాన్ని తమ టీ తోటల్లో కార్మికులుగా దాదాపు నిర్బంధ వెట్టి కూలీలుగా భారీగా తరలించింది. ఈ అమాయక ఆదివాసీ ప్రజలను, వారి శ్రమశక్తిని తీవ్రంగా కొల్లగొట్టటం ద్వారా డంకన్ యాజమాన్యం అనూహ్య లాభాలార్జించింది. భారతదేశంలో 1947 అధికారమార్పిడి తదనంతరకాలంలో కూడా, డంకన్ టీ తోట కార్మికులు వలసకాలంనాటి జీవన, పని పరిస్థితులలోనే వుండిపోయారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా జారీచేసే రేషన్‌కార్డులు కూడా వీరికి అందచేయ లేదు. అయితే, టీ తోటల కార్మికులందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందచేయటం కోసం టీ తోటల యజమానులకు ప్రభుత్వం సరుకులను సరఫరా చేస్తోంది.

ప్రస్తుతం డంకన్ యాజమాన్యం 15 టీ తోటలను మూసివేసింది. మొత్తంగా ఉత్తర బెంగాల్‌లో 30కి పైగా టీ తోటలను ఆయా యాజమాన్యాలు నిలిపి వేయటమో లేదా మూసివేయటమో చేశాయి.

ఈవిధంగా ఆకస్మాత్తుగా డంకన్ యాజమాన్యం తమ టీ తోటల కార్మికులకు ఉపాధి లేకుండా చేసి, వారికి వేతనాల చెల్లింపును నిలిపివేసింది. కార్మికుల నివాస ప్రాంతాలకు మంచినీటి సౌకర్యాన్ని, విద్యుత్తు సరఫరాను నిలిపివేసింది. గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు పెన్షనను, పి.ఎఫ్. నిధులను చెల్లించకుండా నిలిపివేసింది. కనుక, ఈ కార్మికుల కుటుంబాలన్నీ దుర్భరమైన పరిస్థితులల్లో తీవ్ర ఆకలి బాధల నెదుర్కొంటున్నారు. ఈ తోటలలో పనులు కోల్పోయిన కార్మికులు, తప్పనిసరి పరిస్థితుల్లో అతితక్కువ వేతనాలకు, అత్యంత అధిక పనిగంటలు శ్రమించేందుకు సిద్ధమై, దగ్గరలోని ఇతర టీ తోటల్లో పనిచేయడానికి నెట్టబడుతున్నారు. మరికొంతమంది కార్మికులు నదీ తీర ప్రాంతాల్లో రాళ్ళు కొట్టే పనులకు వెళ్తున్నారు. ఈ టీ తోటల కార్మికులలో ముఖ్యంగా ఒంటరి మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతోనున్న వారు అత్యధికంగా ఆకలి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటూ వున్నారు.రాళ్ళు

కొట్టినందుకు వారు వారానికి 70 రూ. మాత్రమే పొందుతున్నారు. అంటే నెలకు 300 మించి ఎట్టి పరిస్థితుల్లోనూ వారు సంపాదించలేరు. ఈ పరిస్థితుల్లో జీవనం దుస్సాధ్యమనేది నిస్సంశయం. అనేకమంది యువ కార్మికులు భూటాన్, కేరళ, ఢిల్లీ, తమిళనాడు ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ కుటుంబాలలోని చిన్నపిల్లలు కూడా ఏదో ఒక పని చేయడానికి నెట్టబడ్తున్నారు. తద్వారానే కుటుంబానికి, తమ తిండికి ఎంతో కొంత తోడ్పడటం జరుగుతోంది.

కనుక, చట్టవిరుద్ధంగా, అమానవీయంగా డంకన్ యాజమాన్యం టీ తోటల మూసివేతతో 15 వేలమందికి పైగా టీ తోటల కార్మికుల, వారి కుటుంబాల ఉనికి, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారి వున్నాయి.

టీ తోటలను మూతబెట్టి, వేలాది కార్మికులను అర్ధాంతరంగా పనులు లేకుండా చేసి వారిని, వారి కుటుంబాలను ఘోరమైన ఆకలికి, చెప్పనలవికాని వేదనలకు గురిచేస్తోన్న డంకెన్ యాజమాన్యాన్ని ఈ పరిస్థితికి బాధ్యునిగా చేసి, వారితో చర్చలు జరిపి, టీ తోటలను తిరిగి తెరిపించి కార్మికులందరికీ జీవనోపాధిని కల్పించేందుకు ప్రభుత్వ కార్మికశాఖాధికారులుగానీ, లేదా వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకత్వాలు కానీ చేసిందేమీలేదు.

కార్మికులను యాజమాన్యాల దోపిడీ కోరల నుండి కాపాడి, వారికి నైతికంగా, చట్టపరంగా రక్షణగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నేరస్థులైన టీ తోటల యజమానుల పక్షం వహించి, కార్మికులకు ఎలాంటి భద్రతా లేకుండా గాలికొదిలేశాయి.

కనుక, ఈ దేశంలో కార్మికులు వ్యవస్థీకృత ట్రేడు యూనియన్ల నాయకత్వంలో సాగే మొక్కుబడి, ప్రదర్శనాత్మక ఉద్యమాలపై ఆధారపడకుండా వర్గ దృక్పథంతో వర్గ రాజకీయాలతో తమకు తాముగా ఐక్యమై సంఘటితమై, తమ వర్గ ప్రయోజనాలను కాపాడుకునేందుకు నిరంతరాయ వర్గపోరాటాలు నిర్వహించటం మినహా మరో మార్గంలేదు.

ooooo